శుక్ర వారం
21-04-2023
సంపుటి - 08,
సంచిక - 301
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బిగ్ షాక్



### పరువు నష్టం కేసులో పిటిషన్ డిస్మిస్



**సూరత్, ఏప్రిల్ 20 (సమసమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బిగ్ షాక్ తగిలింది. పరువు నష్టం కేసులో ఆయనకు చుక్కెదురైంది. రాహుల్ వేసిన పిటిషన్‌ను సూరత్ సెషన్స్ కోర్టు డిస్మిస్ చేసింది. మోడీ ఇంటిపేరుపై వ్యాఖ్యలపై సూరత్ కోర్టు ఇటీవల రాహుల్ గాంధీకి రెండేళ్లు జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసులో తనకు విధించిన శిక్షపై స్టే విధించాలంటూరాహుల్ గాంధీ వేసిన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం రోజున విచారణ జరగగా రాహుల్ పిటిషన్ ను తోసిపుచ్చింది. ఈ కేసులో రాహుల్‌కు రెండేళ్ల పాటు జైలుశిక్ష పడటంతో ఎంపీ పదవిపై అనర్హత వేటుపడింది. గుజరాత్ హైకోర్టులో ఇదే కేసులో రాహుల్ పిటిషన్ వేయనున్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో

3వ పేజీలో...

## కొత్తగా 12,591 కరోనా కేసులు నమోదు

కేరళలో 11మంది మృత్యువాత

కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌కు పాజిటివ్



3వ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (సమసమాజం):** దేశంలో కరోనా కేసులు రెండురోజుల క్రితం తగ్గినా.. మళ్లీ వ్యాప్తి పెరిగి అధికంగా కేసులు నమోదవుతున్నాయి. గడచిన 24 గంటల్లో 12,591 కొత్త కరోనా కేసులు నమోదై.. ఎనిమిది నెలల గరిష్టానికి చేరాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ గురువారం వెల్లడించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 65,286

## రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ చలో విజయవాడ

విజయనగరంలో పోస్టర్ ఆవిష్కరించిన డిసిసి అధ్యక్షుడు



3వ

**విజయనగరం, ఏప్రిల్ 20 (సమసమాజం):** బిజెపి దుర్మార్గమైన బుద్ధితో రాహుల్ గాంధీపై పార్లమెంట్ అనర్హత వేటువేయడంపై దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా అనేక నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 24వ తేదీన జిల్లా కాంగ్రెస్ పార్టీ చలో విజయవాడకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ మేరకు కార్యక్రమంనకు సంబంధించిన పోస్టర్స్ విడుదల చేసారు. గురువారం జిల్లా కాంగ్రెస్

## మోడీకి కశ్మీర్ చిన్నారి లేఖతో విద్యాశాఖలో కదలిక

పాఠశాలను 91 లక్షలతో అభివృద్ధికి శ్రీకారం



3వ

**శ్రీనగర్, ఏప్రిల్ 20 (సమసమాజం):** జమ్మూ-కశ్మీరుకు చెందిన ఓ విద్యార్థిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖ వల్ల సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. ఆమె కోరిక ప్రకారం ఆమె చదువుతున్న పాఠశాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మోదీకి ఆమె పంపిన వీడియో సందేశం సామాజిక మాధ్యమాల్లో

## వేసవి రద్దీతో మెట్రో స్టేషన్లు కిటకిట

భారీగా పెరిగిన ప్రయాణికుల సంఖ్య

సర్వీసులు పెంచాలని వినతి




3వ

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** హైదరాబాద్ మెట్రో రికార్డ్ బ్రేక్ చేసింది. మెట్రో స్టేషన్లకు ప్రయాణికులు పోటెత్తుతున్నారు. రోడ్లపై పెరుగుతున్న రద్దీతోపాటు ఎండాకాలం కావటంతో.. అందరూ మెట్రో వైపు చూస్తున్నారు. మెట్రోల

## వరంగల్ బస్టాండులో డ్రైవర్ నిర్లక్ష్యం

బస్సు ఢీకొనడంతో విద్యార్థి మృతి

బస్సు అద్దాలు ధ్వంసం చేసిన తోటి విద్యార్థులు




3వ పేజీలో...

**వరంగల్, ఏప్రిల్ 20 (సమసమాజం):** వరంగల్ బస్టాండ్ లో డ్రైవర్ నిర్లక్ష్యం ఓ విద్యార్థి ప్రాణాన్ని బలితీసుకుంది. విద్యార్థిని బస్సు ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన మిగతా స్టూడెంట్స్ బస్టాండులోనే ఉన్న నాలుగు బస్సుల అద్దాలను ధ్వంసం చేశారు. వీరితో

## వీఆర్‌వో వ్యవస్థతో పనిలేదు

హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

28లోగా వాదనలు సమర్పించాలని ఆదేశం




**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** తెలంగాణలో వీఆర్వో వ్యవస్థ రద్దుకుసంబంధించిన అంశంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. వీఆర్వోలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లను సుదీర్ఘకాలం విచారించిన హైకోర్టు ఈనెల 28లోగా లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశించిన హైకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. ఈ సందర్భంగా పలు అంశాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. వీఆర్‌వో వ్యవస్థ రద్దు విధాన నిర్ణయం తెలిపింది. రాష్ట్రంలో రెవెన్యూ రికార్డులను డిజిటలైజ్ చేయడంతో వీఆర్వో వ్యవస్థతో పనిలేకుండా పోయిందని తెలంగాణ సర్కార్ హైకోర్టుకు తెలిపింది. వీఆర్‌వో చట్టాన్ని రద్దుచేస్తూ వీఆర్‌వోలను ఇతర ప్రభుత్వ శాఖల్లోకి బదిలీ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అడ్వొకేట్

3వ పేజీలో...

## ఆర్మీ వాహనంలో మంటలు

### నలుగురు జవాన్ల దుర్మరణం



**శ్రీనగర్, ఏప్రిల్ 20 (సమసమాజం):** జమ్ముకశ్మీర్ లోని పూంచ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. తోతావాలి గల్లీలో ఆర్మీ వాహనంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు జవాన్లు దుర్మరణం పాలయ్యారు. పలువురికి తీవ్రగాయలయ్యాయి. రోడ్డుపై ఆర్మీ వెహికిల్‌లో మంటలు చెలరేగడంతో అందరూ షాక్‌కు గురయ్యారు. జమ్ము-పూంచ్ హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆర్మీ ఆదేశించింది సంఘటనా స్థలానికి ఫైర్ బ్రిగేడ్ చేరుకుని మంటలను ఆర్పింది. భట్టా దురియన్ అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సీనియర్ ఆర్మీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అయితే, వీరంతా 49 రాష్ట్రీయ రైఫిల్స్ 13 సెక్టార్ రోమియో ఫోర్స్ కి చెందిన వారిగా గుర్తించారు. పిడుగుపాటు కారణంగా అత్యధిక ఓల్టేజ్ విద్యుత్ ప్రవహించడంతో మంటలు చెలరేగినట్లుగా ప్రాథమిక అంచనాకు వచ్చారు ఆర్మీ అధికారులు. గాయపడిన జవాన్లను ఆస్పత్రికి తరలించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం, ఈ ఆర్మీ వాహనంలో ఆయుధాలతో పాటు, డీజిల్ కూడా ఉంది, దీని కారణంగా మంటలు మరింత చెలరేగాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో వర్షం కురుస్తున్నప్పటికీ ట్రక్కు మంటలను అదుపు చేయలేకపోయింది. ఏదైనా విధ్వంసం జరిగిందా..? మరేదైనా కారణమా అని తెలియాల్సి ఉంది. ఆర్మీ అధికారులు సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని విచారణ మొదలు పెట్టారు. ప్రమాద స్థలం నుంచి ఘటనకు సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. లేక ఉగ్రవాదుల చర్య ఏమైనా ఉందా అనే కోణంలో ఆర్మీ అధికారులు దర్యప్తు చేస్తున్నారు.

## ఆరుతడి పంటలతో లాభాలు ఆర్జించండి

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వానికి సహకరించండి

దేశంలో 24 గంటల కరెంట్ అందిస్తున్నది మనమే



3వ పేజీలో...

**నిజామాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** వ్యవసాయరంగం బలోపేతానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఎక్కడా లేనివిధంగా రైతులకు ఉచితంగా 24గంటల కరెంట్ అందిస్తున్న ఏకైక రాష్టరం తెలంగాణ మాత్రమేనని అన్నారు. తెలంగాణ లాగా ఇతర రాష్ట్రాల్లో బిజెపి ఎందుకు ఈ పనిచేయలేకపోతున్నదో నిలదీయాలన్నారు. అలాగే అనేక విధాలుగా రైతాంగానికి అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. రైతులు ఆరుతడి, వాణిజ్య పంటలు

## 25వరకు ఎడ్‌సెట్ గడువు పొడిగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** రాష్ట్రంలోని బీఎడ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. అయితే అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు దరఖాస్తుల గడువును ఏప్రిల్ 25వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని, తమకు దగ్గర్లో ఉన్న పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నరల్, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 30వ తేదీన దరఖాస్తులను ఎడిట్ చేసుకు నేందుకు అవకాశం కల్పించారు. మే 5వ తేదీ నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎడ్‌సెట్‌ను మే 18న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహిస్తారు. ఎడ్‌సెట్‌ను గతంలో ఉస్మానియా వర్సిటీ నిర్వహించింది. ఈ ఏడాది నల్లగొండలోని మహాత్మాగాంధీ వర్సిటీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

## ఆసరా పెన్షన్ల కోసం ఎదురుచూపు

నిధులు లేవంటున్న అధికారులు



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** జిల్లాల్లో కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు కావడంలేదు. వివిధ విభాగాల్లో అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకోవడమే తప్ప అనుమతులు రావడం లేదు. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. ఇందుకు ఆర్థిక ఇబ్బందులే కారణమని స్పష్టమవుతోంది. పింఛన్

3వ పేజీలో...

## పేపర్ లీకేజీలో దోషులకు అండ

ట్విటర్‌లో విమర్శలు గుప్పించిన ప్రవీణ్



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ మీద సీఎం కేసీఆర్ వేసిన సిట్ నిజంగానే కూలబడిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు. ఇప్పటి వరకు 18 మంది నిందితులను అరెస్టు చేసి వాళ్లను పువ్వుల్లో పెట్టి కాపాడుకుంటున్నరని ఆయన ఆరోపించారు. వీరిపై పిడి యాక్ట్ ఎందుకు నమోదు చేయలేదని అన్నారు.వీళ్లను వేరే పేపర్ల కొనుగోలు మీద, వేరు వేరు ప్రదేశాల్లో, సమయాల్లో అరెస్టు చేసినపుడు వీళ్ల మీద ఇంకా కొత్త కేసులు పెట్టాలి కదా? అని ప్రశ్నించారు.వీళ్లలో ముఖ్యుల మీద పీడీ యాక్ట్ ఇంకా ఎందుకు పెట్టడం లేదని ప్రవీణ్ కుమార్ నిలదీశారు. ప్రజలకు నిజాలను ప్రెస్ మీట్ పెట్టి ఎప్పుడు చెబుతారన్న ఆయన.. సీఎం ఎందుకు ముఖం చాటేస్తున్నారని ట్వీట్ లో పేర్కొన్నారు.

## సంపాదకీయం

# రైతాంగ సమస్యలు యథాతథం !

సాగుచట్టాలను రద్దు చేశాక నేటికీ సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. దీనిపై సమగ్రంగా చర్చించాలన్న ధోరణి కానరావడం లేదు. దేశంలోని అన్నదాతలను ఆదుకోవడంతో పాటు.. దేశానికి అన్నం పెట్టాలన్న దూరదృష్టి నేతల్లో కొరవడింది. ఏం చేస్తే దేశంలో ప్రజలందరికి ఆహార ధాన్యాలు దక్కగలవో చర్చించడం లేదు. పంటలు పండుతున్నా అందరికీ ఆహారాధాన్యాలు నేటికీ అందుబాటులోకి రావడం లేదు. సాగుచట్టాలను రద్దు చేసిన తరవాత కూడా ప్రధాని మోడీ ఈ సమస్యల పై చర్చించడం లేదు. చట్టసభల్లో చర్చించడం లేదు. బయటా చర్చించడం లేదు. ప్రపంచానికి అన్నం పెట్టే స్థితిలో భారతదేశం ఉన్నా..వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మాత్రం నేతలు ముందుకు రావడం లేదు. పక్కా మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం, భారీగా పండుతున్న పంటలను కొనుగోలు చేసే వ్యూహం ప్రదర్శించడం లేదు. పంటల కొనుగోలు సమయంలో సరైన వ్యూహంతో ప్రభుత్వాలు చర్య తీసుకుంటే ఇబ్బందులు రావు. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్...నీటి సరఫరా, రైతుబంధు కింద పెట్టుబడి సాయం...రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమా పథకం అమలవుతున్నాయి. మిషన్ కాతీయ తదితర పథకాలతో చెరువుల్లో నీరు పెరిగి పంటల దిగుబడి పెరిగిందని ప్రభుత్వమే చెబుతోంది. ఇన్ని పథకాలు ప్రవేశ పెట్టి పంటలు కొనుగోలు చేయకపోతే ఎలా? పంటలు అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కితే రాజకీయం ఎలా అవుతుంది.? గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలు కొనుగోలు చేయాలని కోరుకోవడం ఏటా ఓ ప్రహసనంగా మారింది. ఇది ఒక్క తెలంగాణ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. సీజన్ లో సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు ముట్టచెప్పితే చాలు.. రైతు సమస్యలు సగం తీరినట్లే. కానీ మార్కెట్ యార్డుల్లో పడిగాపులే రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. దానికితోడు గిట్టుబాటు ధరలు రావు. అన్నీవున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా కొనుగోళ్ల విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం పెద్దగా కార్యాచరణ చేపట్టడంలేదు. పంట ఏదైనా డిమాండ్ ఉండదు. అమ్ముకోవడానికి నానాకష్టాలు పడాల్సిందే. ఇకపోతే దేశంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ప్రచారం కానరావడం లేదు. కొంతమంది రైతులు ఎరువులు ఎక్కువ వేస్తే దిగుబడి పెరుగుతుందని అనుకోవడం వల్ల మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతిం టోంది. అలాగే ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఏటా దేశంలో రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇతరత్రా తాయిలాలు ప్రకటిస్తూ ప్రభుత్వాలు రైతన్నలను మోసం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని..మార్కెట్‌కు తీసుకుని వచ్చిన పంటలను సకాలంలో కొనుగోలు చేయాలన్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రధానం గా వరి,కంది, మిర్చి, పత్తి, ఎర్రజొన్న, పసుపు రైతులు బాధలు వర్ణనాతీతం. సన్నకారు రైతులకు అండగా ఉన్నానని,ఏటా 6వేల కోట్లు వారి ఖాతాల్లో వేస్తున్నానని ప్రధాని మోడీ గొప్పగా ప్రకటించు కోవడం తప్ప సమగ్ర వ్యవసాయ విధానానికి శ్రీకారం చుట్టడం లేదు. నిజానికి ఖాతాల్లో డబ్బులు వేయడం కాకుండా వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో ఆలోచించడం లేదు. గ్రామాలను ఆధారం చేసుకుని వ్యవసాయాన్ని పాడి పరిశ్రమను, కోళ్ల పరిశ్రమను ఉమ్మడిగా అభివృద్ధి చేయాలి. దీంతో గ్రామీణ వృత్తులకు కూడా ఆసరా దక్కుతుంది. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అకాల వర్షాల కారణంగా భారీగా పంటలు దెబ్బతింటున్న సందర్భంలో వారికి సకాలంలో పరిహారం అందడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 33 శాతానికంటే ఎక్కువ మొత్తంలో

పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారానికి సిఫార్సు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతున్న నష్టం లెక్కల్లోకి రావడం లేదు. పంటనష్టం అంతకు మించి ఉంటేనే వ్యవసాయాధి కారులు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీమా చేస్తున్న రైతులకు పరిహారం అందేది నామమాత్రంగానే ఉంటుంది. వేల సంఖ్యలో రైతుల పంట నష్టం జరిగినా, రైతులకు అందుతున్నది మాత్రం తక్కువగానే ఉంటుంది. వర్షాలు కురియడం,పంటను నష్ట పోవడం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నా అందడం లేదు. బీమా నిబంధనల ప్రకారం నష్టం 33 శాతం దాటితేనే పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఈ నిబంధనలను మార్చాల్సి ఉంది. ఇన్సూరెన్స్ ఉన్న రైతులందరికి పరిహారం దక్కడం లేదు. భారీ వర్షాలతో నష్టపోతే రుణాలు తీసుకున్నవారికి ఈ బీమాను అమలు చేయక పోవడంతో రైతులపై అదను భారం పడుతోంది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఉత్పత్తి ఆధారంగా ఎంత పంటనష్టం జరిగితే అంతే మొత్తాన్ని అందించనున్నారు. అకాల వర్షాలు భారీగా పంట నష్టాన్ని కలిగించి, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడు కునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యలను అన్నీ చర్చించాలి. ఆర్థికంగా తాయిలాలు ఇవ్వడం కాకుండా సమస్యలను చర్చించి విధానాలు రూపొందించాలి. కెసిఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధును ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం..పంటల కొనుగోళ్లకు సంబంధించి నిర్దిష్ట విధానాలు అమలు చేయడం లేదు. మార్క్‌ఫెడ్, సిసిఐలు రంగంలోకి దిగినా ఫలితం దక్కడంలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ అంటూ అట్టహాసంగా ప్రకటనలు చేసినా రైతులకు మేలు చేకూర్చలేదు. పంటలను గిట్టుబాటుధరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏటా రైతులు రోడ్డెక్కడం..దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం మామూలు విషయంగా మారింది.గిట్టుబాటు ధరలతో పాటు కొనుగోళ్ల కోసం పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువవడంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పంటలు మార్కెట్‌కు వచ్చే సమయంలో పక్కాగా కొనుగోళ్లు సాగాలి. గిట్టుబాటు ధరలు దక్కాలి. దళారుల మోసాలు అరికట్టాలి. ఏటా పంట ఏదయినా జిల్లాల్లో పండించిన పంటలను కొనేలా కార్యాచరణ సాగాలి. ఇదంతా కూడా పక్కాగా ప్రణాళిక మేరకు సాగాలి. ఇందుకు వ్యవసాయా విధానాలను రూపొందించాలి. ఏటా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోళ్లు చేయడం ప్రభుత్వం బాధ్యతగా గుర్తించాలి.

# ఆరాధ్య బచ్చన్ ఆరోగ్యంపై ఫేక్ న్యూస్


## దుర్వార్తలపై కోర్టుకెక్కిన బచ్చన్ కుటుంబం



బాలీవుడ్ హీరో, బిగ్ బీ అమితాబ్ బచ్చన్ మనవరాలు, ప్రముఖ స్టార్ కపుల్ ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కుమార్తె ఆరాధ్య బచ్చన్ కు సంబంధించిన ఫేక్ న్యూస్ ను తొలగించాలని ఢిల్లీ హైకోర్టు యూట్యూబ్‌ను ఆదేశించింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి తప్పుడు వార్తలను షేర్ చేయరాదని కోర్టు తెలిపింది. అంతకు ముందు తమ కుమార్తె ఆరోగ్యంపై ఫేక్ న్యూస్ క్రియేట్ చేసి, యూట్యూబ్ లో ప్రసారం చేస్తున్నారన్న ఆరోపణలతో ఐశ్వర్య రాయ్ బచ్చన్ , అభిషేక్ బచ్చన్ లు కోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై విచారణ చేపట్టిన కోర్టు.. తాజాగా గూగుల్ ఎల్ఎల్?సీతో సహా అన్ని యూట్యూబ్ ఛానెళ్లకు సమన్లు జారీ చేసింది. అంతకుముందు తన కూతురు మైనర్ అని.. ఆమె ఆరోగ్యం గురించి నిరాధారమైన ప్రచారం చేస్తూ కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ ప్రసారం చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని అభిషేక్ దంపతులు పిటిషన్ లో పేర్కొన్నారు. ఆ వీడియోలన్నింటిని డీ లిస్ట్ లేదా డియాక్టివేట్ చేసేలా ఆదేశించాలని ధర్మాసనాన్ని కోరారు. ఈ క్రమంలోనే గూగుల్ తో పాటు మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి చెందిన గ్రీవెన్స్ సెల్ లను కేసులో పార్టీలుగా చేర్చింది.ఈ తరహా ట్రోలింగ్స్‌పై ఆరాధ్య తండ్రి అభిషేక్ బచ్చన్ చాలాసార్లు సీరియస్ అయ్యారు. 11ఏండ్ల తమ పాపను టార్గెట్ చేయడం సరికాదని చెప్పారు. ఎంతకీ సమస్య పరిష్కారం కాకపోవడంతో.. ఇటీవల ఆ కుటుంబం కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది.

# ప్రపంచానికి బుద్ధుడిని అందించిన ఘనత

## శాంతి సందేశం మన విధానం : ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (సమసమాజం):** ప్రపంచానికి భారతదేశం యుద్ధాన్ని అందించలేదని, బుద్ధుడిని అదించిందని తెలిపారు ప్రధాని నరేంద్ర మోడీ. శాంతిసందేశం ఇచ్చిన గొప్పదేశం భారత్ అన్నారు. గౌతమ బుద్ధుని గొప్ప బోధనలు శతాబ్దాలుగా లెక్కలేనన్ని మంది ప్రజలను ప్రభావితం చేశాయని అన్నారు. ఢిల్లీలోని గ్లోబల్ బౌద్ధ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ప్రపంచం నేడు యుద్ధం, అశాంతితో బాధపడు తోందన్న మోడీ.. అయితే శతాబ్దాల క్రితం బుద్ధుడు దీనికి పరిష్కారం చెప్పాడని అన్నారు. బుద్ధుని మార్గమే భవిష్యత్తు , స్థిరత్వానికి మార్గమని ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడించారు. బుద్ధ బోధనల నుండి ప్రేరణ పొందిన భారతదేశం ప్రపంచ సంక్షేమం కోసం కొత్త కార్యక్రమాలను తీసుకుంటోందని చెప్పారు. ప్రజలు, దేశాలు తమ ప్రయోజనాలతో పాటు ప్రపంచ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మోడీ వెల్లడించారు.అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య సహకారంతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఏప్రిల్ 20 , 21 తేదీల్లో గ్లోబల్ బౌద్ధ సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ బౌద్ధ సన్యాసులు, పండితులు, ప్రతినిధులు హాజరయ్యారు.

# తెలంగాణలో బిజెపికిచోటు లేదు

## మంత్రినిరంజన్ రెడ్డి విమర్శలు




**వనపర్తి, ఏప్రిల్ 20 (సమసమాజం):** బీఆర్ఎస్ ఏర్పాటు, తరవాత జరుగుతున్న సభలతో బీజేపీలో ప్రకంపనలు మొదలయ్యాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో ఆ పార్టీకి స్థానం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదలతో రాష్ట్రం సాధించిన విధంగానే దేశ సంక్షేమం కోసం అంతే పట్టుదలతో ఉన్నారని వెల్లడించారు.తెలంగాణ మోడల్ అభివృద్ధి కోసం దేశం ఎదురు చూస్తుందని, బీఆర్ఎస్ ఏర్పాటుతో దేశ రాజకీయాల్లో పెను మార్పులు వచ్చాయని తెలిపారు. అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశాన్ని అన్ని రంగాలలో భ్రష్టుపట్టిస్తుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ , గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని అన్నారు.బీజేపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

# యవ్‌చోప్రా సతీమణి పమేలా కన్నుమూత



బాలీవుడ్ లెజెండరీ డైరక్టర్ యశ్ చోప్రా సతీమణి పమేలా చోప్రా గురువారం రోజు ఉదయం కన్నుమూశారు. ప్రస్తుతం ఆమెకు 74 సంవత్సరాలు. పమేలా చోప్రా సుప్రసిద్ధ భారతీయ నేపథ్య గాయని. పలు సినిమాల్లో పాటలు పాడిన ఆమె యశ్ రాజ్ ఫిలిమ్స్ నిర్మించిన కొన్ని చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె గత 15 రోజులుగా ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందతూ కన్నుమూశారు. వైద్యులు ఆమెకు ఇన్ని రోజులు వెంటిలేటర్‌పై చికిత్సను అందించారు. ఉదయం 11 గంటలకు ముంబైలో ఆమె అంత్యక్రియలు జరిగినట్టుగా కుటుంబ సభ్యులు తెలిపారు. పమేలా 1970లో యశ్ చోప్రాను వివాహం చేసుకుంది. వీరికి ఆదిత్య చోప్రా ,ఉదయ్ చోప్రా అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరూ ఇండస్ట్రీలోనే కొనసాగుతున్నారు. బాలీవుడ్ లో ఎన్నో గొప్ప సినిమాలు తీసిన యశ్ చోప్రా 2012లో కన్నుమూశారు.

# 73వ ఏట అడుగిడిగిన బాబు

## 73 కిలోల కేక్ కట్ చేసి బాబుకు శుభాకాంక్షలు



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్ వద్ద టీడీపీ డివిజన్ నేతల ఆధ్వర్యంలో 73 కేజీల భారీ కేకును కట్ చేసి చంద్రబాబు నాయుడుకి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మాణంలో తనదైన ముద్ర వేసి విజన్ ఉన్న నాయకుడిగా రాష్టాన్ని అభివృద్ధి చేశారని టీడీపీ నేతలు, చంద్రబాబును కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని చెప్పారు.

# పర్యావరణహిత టూరిజం సర్కార్ లక్ష్యం



ఎకో టూరిజం ప్రాంతాల అభివృద్ధికి కృషి
మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** రాష్ట్రంలో బాధ్యతా యుతమైన, పర్యావరణహిత టూరిజాన్ని ప్రోత్సహిస్తామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా అటవీ ప్రాంతాలు, టైగర్ రిజర్వ్‌ల సమీపంలో మరిన్ని ఎకో టూరిజం ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అద్భుత, ప్రకృతి రమణీయమైన ప్రాంతాలు ఒక్కొటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. వాటి ప్రత్యేకతను కాపాడుతూనే, ప్రజలకు దగ్గర చేసే ప్రయత్నం చేస్తామన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో మన్ననూరు వద్ద ఎకో టూరిజం రిసార్ట్, ఆరు కాటేజీలు, ఎనిమిది కొత్త సఫారీ వాహనాలను అందుబాటులోకి తీసుకుని వచ్చామని అన్నారు. పర్యాటకులు ఒక రోజు పాటు అమ్రాబాద్‌లో గడిపేందుకు వీలుగా రూపొందించిన టైగర్ స్టే ప్యాకేజీ ఇకపై ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు వీలుగా పోర్టల్‌ను ప్రారంభించారు. అమ్రాబాద్ వచ్చే సందర్శకులకు సేవలు అందించేం దుకు కొత్తగా శిక్షణను ఇచ్చిన గైడ్లు ఇకపై అందుబాటు లో ఉంటారని అటవీ శాఖ ప్రకటించింది. అటవీ పర్యవేక్షణ నేరుగా చేసేందుకు వీలుగా కొత్తగా 10 లైవ్ నిఘా కెమెరాలు నేటి నుంచి పనిచేయటం మొదలైంది. స్థానిక గిరిజన, చెంచు మహిళలకు ఉపాధి కల్పించే జ్యూట్ బ్యాగుల తయారీ, హెల్త్ క్లినిక్, ప్లాస్టిక్ రీ సైక్లింగ్ సెంటర్, బయోల్యాబ్‌లను సందర్శించిన మంత్రి, అక్కడ పనిచేసే వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమ్రాబాద్‌తో పాటు అటవీ ప్రాంతాల్లో పర్యటించే, ప్రయాణించే ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి కోరారు. అన్ని అడవులు ప్లాస్టిక్ ఫ్రీ జోన్లుగా ప్రకటించామని, వన్యప్రాణులకు హాని చేసే ప్లాస్టిక్ అడవుల నుంచి దూరంగా ఉంచాలని తెలిపారు. జాతీయ సంపదలు అయిన అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు.

# రేణుక నివాసంలో కాంగ్రెస్ నేతల భేటీ

## పొంగులేటిని రప్పించేందుకు చొరవ

## 21న నల్లగొండ సభను రద్దు చేసుకున్న నేతలు





**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** రాష్ట్రంలో అప్పుడే ఎలక్షన్ వాతావరణం కనిపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈసారి ఎలాగైనా తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ రేణుకా చౌదరి ఇంట్లో కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో పాటు మాజీ ఎంపీలు బలరాం నాయక్, సురేశ్ షట్కర్, ఇతర నేతలు హాజరయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలపై నేతలు చర్చించారు. ఈ మధ్యే బీఆర్ఎస్ అధిష్టానం సస్పెండ్ వేటు వేసిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపైనా కాంగ్రెస్ నాయకులు చర్చించారు. పొంగులేటి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేలా రేణుకాచౌదరి చొరవ చూపాలని పార్టీ నాయకులు కోరారు. ముఖ్యంగా నిరుద్యోగ దీక్షల సక్సెస్ పై కాంగ్రెస్ లీడర్లు ఫోకస్ పెట్టారు. తమకు చెప్పకుండా ఏప్రిల్ 21న నల్గొండలో నిరుద్యోగ దీక్ష పెట్టారంటూ జిల్లా నేతల ఫిర్యాదు చేశారు. దీంతో ఏప్రిల్ 21న నల్గొండలో జరగాల్సిన నిరుద్యోగ దీక్ష 28వ తేదీకి వాయిదా పడింది.

# ఖలిస్తానీ నేత అమృత్‌పాల్ సింగ్ భార్య అరెస్ట్

## లండన్ వెళుతుండగా విమానాశ్రయంలో పట్టివేత





**అమృత్‌సర్, ఏప్రిల్ 20 (సమసమాజం):** పరారీలో ఉన్న ఖలిస్తానీ నేత అమృత్‌పాల్ సింగ్ భార్యను పంజాబ్ పోలీసులు అమృత్‌సర్ విమానాశ్రయంలో అడ్డుకున్నారు. కిరణ్‌దీప్ కౌర్ బ్రిటన్‌కు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నట్లు గురువారం వర్గాలు తెలిపాయి. మార్చి 8 నుండి పరారీలో ఉన్న 'వారిస్ పంజాబ్ డా' అధిపతి అమృత్‌పాల్‌పై , అతని దుస్తులపై పంజాబ్ పోలీసులు అణిచివేత ప్రారంభించినప్పుడు అతనిపై భారీ వేట సాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. లండన్‌కు విమానం ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా అమృత్‌సర్‌లోని శ్రీ గురు రామ్‌దాస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కిరణ్‌దీప్ కౌర్‌ను అడ్డుకున్నారని పంజాబ్ పోలీసు వర్గాలు తెలిపాయి. ఆమెను ఇమ్మిగ్రేషన్ విభాగం విచారిస్తోంది. మార్చి 18 నుండి అమృతపాల్ సింగ్ పరారీలో ఉన్నాడు. జలంధర్ జిల్లాలో తన కాన్వాయ్‌ను అడ్డగించిన తర్వాత అమృతపాల్ పోలీసులకు స్లిప్ ఇచ్చాడు. అప్పటి నుండి, ఖలిస్తానీ నాయకుడు అరెస్టు నుండి తప్పించుకోవడానికి తన రహస్య స్థావరాలు, వాహనం, రూపాలను అనేకసార్లు మార్చాడు. అతని సన్నిహితుడు పపల్‌ప్రీత్ సింగ్‌ను కూడా అరెస్ట్ చేశారు. కానీ ఆయన మాత్రం పట్టుబడటం లేదు. సీనియర్ పోలీసు అధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ, కిరణ్‌దీప్ కౌర్‌పై లుక్ ఔట్ సర్క్యులర్‌ను జారీ చేసినట్లు తెలిపారు. ఎయిరిండియా ఏఐ 169 విమానంలో గురువారం ఆమె లండన్ వెళ్లేందుకు ప్రయత్నించారని, విమానాశ్రయంలో ఆమెను నిలిపేశామని చెప్పారు. ఆమెను విమానాశ్రయంలోనే ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు.

# కల్వర్టును ఢీకొన్న కారు

## ప్రమాదంలో తండ్రీకొడుకుల దుర్మరణం

**నల్లగొండ,ఏప్రిల్ 20 (సమసమాజం):** నల్లగొండ జిల్లా నకిరేకల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు ఇద్దరూ దుర్మరణం చెందారు. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్ వస్తున్న కారు.. నకిరేకల్ శివారులో జాతీయ రహదారిపై అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకులు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాదీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నెల్లబండ గ్రామం హైవే పక్కన కల్వర్టను కారు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన తండ్రీ కొడుకులు మల్లేష్(59) ,అవినాష్(34) గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జు కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారు మరణించారు. మృత దేహాలను కిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అవినాశ్ రెడ్డి బెయిల్ పిటిషన్

## సుప్రీంలో సవాల్ చేసిన సునీతారెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (సమసమాజం):** వైఎస్ వివేకా హత్యకేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎంపీ అవినాష్ రెడ్డిని ఏప్రిల్ 25 వరకు అరెస్ట్ చేయొద్దని సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సునీత అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె పిటిషన్ పై ఏప్రిల్ 21శుక్రవారం రోజున విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు 25వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఏప్రిల్ 25వ తేదీ వరకు ప్రతిరోజూ అవినాశ్‌రెడ్డి సీబీఐ ఎదుట హాజరుకావాలని తెలంగాణ హైకోర్టు షరతు విధించింది. విచారణకు సహకరించాలని, సీబీఐ అధికారులు ప్రశ్నలను లిఖితపూర్వకంగా అందజేయాలని తెలిపింది. అవినాశ్ రెడ్డి ఇచ్చే సమాధానాలను ఆడియో, వీడియో రికార్డు చేయాలని, విచారణకు సంబంధించిన రికార్డులను కోర్టుకు సమర్పించాలని సీబీఐని హైకోర్టు ఆదేశించింది.


# మునుగోడు టికెట్‌కు ప్యాకేజీ

## చల్లమల్ల కృష్ణారెడ్డి మనీ పాలిటిక్స్ గుట్టు రట్టు !

ఉపఎన్నికలో డబ్బు ఖర్చు పెట్టినందుకు వచ్చే ఎన్నికలో చల్లమల్లకు టికెట్ హామీ ◆ హామీ కుదరదంటూ ఏఐసిసి పెద్దల ఆరా

### డబ్బు రాజకీయాల వల్ల జనాధరణ ఉన్న నేతలకు అన్యాయం

గాంధీభవన్ సాక్షిగా టిపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన అనుచరుడైన చల్లమల్ల కృష్ణారెడ్డికి రాబోయే ఎన్నికలలో టికెట్ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు సమసమాజం పత్రికకు సమాచారాన్ని అందించారు. ఇటీవల జరిగిన మునుగోడు ఉపఎన్నికలో సర్వేల ప్రకారం, జన ఆదరణ పొందిన నేతగా పాల్వాయి శ్రావంతికి టికెట్ రావడంతో చల్లమల్ల కృష్ణారెడ్డి అక్కస్సుకు గురైయ్యారు. ఆ సమయంలో రేవంత్‌తో కీలక ఒప్పందం చేసుకున్నారు. మునుగోడు ఉపఎన్నిక బైపోల్ టికెట్ శ్రావంతిని ప్రకటించిన అనంతరం పాల్వాయి శ్రావంతిని పిలిపించుకున్న రేవంత్‌రెడ్డి డబ్బుల ప్రస్తావన లేవనెత్తాడు. అదే సమయంలో చల్లమల్ల కృష్ణారెడ్డిని పిలిపించి ఉపఎన్నికలో చల్లమల్ల కృష్ణారెడ్డి డబ్బులు ఖర్చుపెడుతాడని చెప్పారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చల్లమల్ల కృష్ణారెడ్డికే టికెట్ ఇస్తానని చెప్పి ఒక కండీషన్ పెట్టారని, ఆ సమయంలో పాల్వాయి శ్రావంతి ఆ విషయంపై తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచే ప్రయత్నం చేసే క్రమంలో వినిపించుకోకుండా రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి నిష్క్రమించారు, ఆ సమయంలో పాల్వాయి శ్రావంతి వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం టీపిసిసి ప్రధాన కార్యదర్శి పదవి పేరుతో, డబ్బుల సంచులను వెంటబెట్టుకొని మునుగోడు నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జ్‌ని అంటూ డమ్మీ ఇంఛార్జ్‌గా చలామణి అవుతూ, ఒంటెద్దు పోకడతో కమిటీలు వేసి కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్లు పాల్వాయి శ్రావంతి, పున్న కైలాష్ నేత లాంటి నేతలను ఇరుకున పెట్టే ప్రయత్నం జరుగుతుంది.




చల్లమల్ల చేష్టలకు గుర్రుగా ఉన్న సీనియర్ కార్యకర్తలు, మనీ పాలిటిక్స్‌కు స్వస్తి చెప్పేందుకు మునుగోడు కాంగ్రెస్ రడీ !

### రేవంత్‌లో నాయకత్వ లేమి
#### ఇందుకే సీనియర్‌లలో అసంతృప్తి

**టీడీపి పార్టీ నుంచి మధ్యంతరంగా కాంగ్రెస్‌లోకి వచ్చిన పాత దోస్తులు మునుగోడు టికెట్ విషయంలో ఇద్దరు కలిసి కాంగ్రెస్ పార్టీ నిబంధనలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారు. జనాధరణతో సంబంధం లేకుండా ప్యాకేజీలు ముట్టజెప్పాలనే విధంగా రేవంత్ తీరు ఉండటం, దానికి చల్లమల్ల సైయ్యంటూ మునుగోడు టికెట్‌కు ప్యాకేజీ ఇచ్చే పరిస్థితిని చూస్తే, డబ్బున్న నేతలకే కాంగ్రెస్‌లో సీటు అడ్డదారిన తెచ్చుకోవచ్చు అనే సంకేతాలు వెలుబడుతున్నాయి. ఏఐసీసీ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు ఖర్చు పెట్టుకుంటేనే టికెట్‌లు ఇచ్చి ప్రోత్సహించాలని చూస్తున్న రేవంత్ తీరును పార్టీ సీనియర్ నేతలు అడుగడుగున తన నాయకత్వాన్ని అడ్డుకుంటున్నారు.**

హైదరాబాద్,ఏప్రిల్20 (సమసమాజం): హటాత్తుగా వచ్చిన మునుగోడు ఉపఎన్నికకు అభ్యర్థిని ప్రకటించిన కాసేపటికే, వచ్చే ఎన్నిక కు మరో అభ్యర్థిని అదే రోజు నిర్ణయించే అధ్యక్షున్ని కేవలం రేవంత్ కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యం. ఇటీవల జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన కొద్దిసేపటికే పాల్వాయి శ్రావంతి చెవిలో వినిపించని శబ్దాలు వినిపించాయి. ఆ మాటలు విన్న పాల్వాయి శ్రావంతి తేరుకునే లోపే అక్కడి నుంచి జారుకున్న రేవంత్‌కు చల్లమల్లకు మధ్య ఆర్థిక ఒప్పందాలు జరిగినట్లు ఒక్కొక్కటిగా సంచలన విషయాలు బయట పడుతున్నాయి. మిగతా వచ్చే సంచికలో...

### కాంగ్రెస్ నూతన కమిటీల ఏర్పాటు తధ్యం
#### మునుగోడు నియోజక వర్గ ఇంఛార్జీ పాల్వాయి శ్రావంతి



ఇటీవల టీపిసిసి ప్రధాన కార్యదర్శి చల్లమల్ల కృష్ణారెడ్డి మునుగోడు నియోజకవర్గ కమిటీలను నియమించారు. ఈ నేపధ్యంలో ఇప్పటికే వేసిన కమిటీలు చెల్లవని, మునుగోడు నియోజకవర్గ ఇంఛార్జీ నేతృత్వంలో త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేసేందుకు, పారదర్శకంగా అందరి సమన్వయంతో ఏర్పాటు చేస్తున్నామని పాల్వాయి శ్రావంతి ఓ ప్రకటనలో తెలిపారు.

## రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ చలో విజయవాడ



(మొదటి పేజి తరువాయి) పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీకి మద్ధత్తుగా పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆద్వర్యంలో చేపట్టనున్న విజయవాడ మహాసభకు సంబంధించిన పోస్టర్స్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆద్వర్యంలో విడుదల చేసారు.ఈసందర్బంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ మార్చి 23న సూరత్ హైకోర్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ పై పరువు నష్టం కేసు విషయంలో ఆయనకు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.అదే విధంగా పై కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం కోసం రెండు నెలల సమయం ఉన్నప్పటికీ 24న ఎఐసిసి, పిసిసి అధ్యక్షులు ఆదేశాల మేరకు జంకానగర్, గాంధీ నగర్ మీదగా పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆద్వర్యంలో విజయవాడ లో నిర్వహించబడుతున్న మహాసభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

## మోడీకి కశ్మీర్ చిన్నారి లేఖతో విద్యాశాఖలో కదలిక

(మొదటి పేజి తరువాయి) వైరల్ అయిన సంగతి తెలిసిందే. థువా జిల్లాలోని మారుమూల గ్రామం లోహాయ్-మల్హార్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న సీరత్ నాజ్ మోదీకి ఇటీవల ఓ లేఖను రాసిన సంగతి తెలిసిందే. తాను చదువుతున్న పాఠశాల దుస్థితిని ఆమె వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. పాఠశాలలోని ప్రిన్సిపాల్ గది, సిబ్బంది గది, మరుగుదొడ్డి, పాఠశాల ఆవరణ వంటివాటిలో కలియదిరుగుతూ, వాటి దుస్థితిని వివరిస్తూ ఆమె ఓ వీడియోను చిత్రీకరించింది. దానిని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. దేశ ప్రజల మాట వినే మోదీ గారూ, నా మాట కూడా వినండి. నేను మీతో ఓ మాట చెప్పాలనుకుంటున్నాను. మా పాఠశాలలో సదుపాయాలు లేవు. నేలపై దుమ్ము, ధూళి విపరీతంగా ఉన్నాయి. దానిపై కూర్చుంటే బట్టలు మురికి అయిపోతున్నాయి. మా అమ్మ మందలిస్తోంది. మా కోసం మంచి పాఠశాలను నిర్మించండని ఆమె మోదీని కోరింది.ఈ వీడియో వైరల్ అవడంతో జమ్మూ పాఠశాల విద్య సంచాలకుడు రవిశంకర్ శర్మ ఆ పాఠశాలను సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ పాఠశాలను ఆధునికంగా తీర్చిదిద్దడం కోసం రూ.91 లక్షలతో ఓ ప్రాజెక్టును మంజూరు చేశామని చెప్పారు. అయితే కొన్ని పరిపాలనాపరమైన అనుమతుల కోసం ఎదురు చూస్తున్నందువల్ల ఈ ప్రాజెక్టు ప్రారంభం కాలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించామని చెప్పారు. పాఠశాలను అభివృద్ధి చేసే పనులు జరుగుతున్నాయని చెప్పారు. జమ్మూ ప్రావిన్స్‌లోని అన్ని జిల్లాల్లోనూ కొత్తగా 1,000 కిండర్‌గా÷-టంగ÷న్లను నిర్మించడం ప్రారంభించామని చెప్పారు. రానున్న మూడు, నాలుగేళ్ళలో ఈ ప్రావిన్స్‌లోని 10 జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాలో 250 చొప్పున కిండర్‌గా÷-టంగ÷న్లను నిర్మిస్తామని చెప్పారు.ఈ నేపథ్యంలో సీరత్ నాజ్ స్పందిస్తూ, తన వీడియో వల్ల తన పాఠశాల అభివృద్ధి పనులు ప్రారంభం కావడం చాలా సంతోషకరమని చెప్పింది. తాను ఐఏఎస్ అధికారిని కావాలని కోరుకుంటున్నానని తెలిపింది.

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బిగ్ షాక్

(మొదటి పేజి తరువాయి) భాగంగా కర్నాటకలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మోడీ ఇంటిపేరుతో వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ వ్యాఖ్యలను తప్పు పడుతూ గుజరాత్‌కు చెందిన బీజేపీ నేత పూర్ణేశ్ మోడీ కోర్టులో కేసు దాఖలు చేశారు. క్రింది కోర్టు తీర్పును నిలుపుదల చేయాలని, సస్పెండ్ చేయాలని ఆయన చేసిన వినతిని సెషన్స్ కోర్టు అంగీకరించలేదు. ఆయన అపీలుపై ఇరు పక్షాల వాదనలను ఏప్రిల్ 13న కోర్టు స్వీకరించింది. అనంతరం తీర్పును రిజర్వు చేసింది. ఈ తీర్పు గురువారం వెలువడింది. రాహుల్ గాంధీ 2019లో కర్ణాటకలోని కోలార్‌లో ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ, దొంగలందరి ఇంటి పేరు మోదీ ఎలా అవుతోందని ప్రశ్నించారు. దీనిపై గుజరాత్‌కు చెందిన పూర్ణేశ్ మోదీ సూరత్ కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసులో రాహుల్ గాంధీ దోషి అని కోర్టు తీర్పు చెప్పింది. ఆయనకు రెండేళ్ళ జైలు శిక్ష విధించింది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. ఇది కక్షపూరిత చర్య అని కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సెషన్స్ కోర్టు రాహుల్ గాంధీ అపీలును అనుమతించినట్లయితే, ఆయనకు విధించిన శిక్ష, దోషిత్వ తీర్పును సస్పెండ్ చేసి ఉంటే, ఆయన లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ జరిగి ఉండేది.

## ఆరుతడి పంటలతో లాభాలు ఆర్జించండి




(మొదటి పేజి తరువాయి) పండించి లాభాలు పొందాలని సూచించారు. దేశంలోని గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కరెంటు కోతలు ఉన్నాయన్నారు. కానీ తెలంగాణలో కరెంట్ కోతలు లేవని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఒక్క యూనిట్ కు రూ.20 రూపాయలు ఖర్చు పెట్టి రైతులకు ఉచితంగా నిరంతర కరెంటు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని రైతులకు 4 వేల తుంపర సేద్య పరికరాలు పంపిణీ చేశామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు శ్రేయస్సు కోసం పాటుపడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి అన్నదాతలు సహకరించాలన్నారు. ఆయిల్ ఫామ్ పంటలు పండించడంతో పాటు అంతర పంటలు వేసి లక్షన్నర రూపాయల నుంచి రెండు లక్షలన్నర రూపాయల వరకు రైతులు ఆర్జిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామానికి చెందిన నర్సింలు స్ఫూర్తితో ఎక్కువ మంది రైతులు కూడా సెరి కల్చర్, ఆయిల్ ఫామ్, కమర్షియల్ పంటలు పండించాలని కోరారు. దేశ అభివృద్ధి కోసం అంబేద్కర్ ఆలోచనలను అమలు చేద్దామన్నారు. మూఢ నమ్మకాలను రూపుమాపి, విద్య పై అవగాహన కల్పిస్తూ ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు. విద్య ఆవశ్యకతను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల పేదరికాన్ని రూపు మాపి, ఆర్థికాభివృద్ధి సాధనకై సీఎం కేసీఆర్ దళితబంధు తెచ్చారని మంత్రి గుర్తు చేశారు. విద్య, ఉద్యోగాల్లో, కాంట్రాక్టులలో కూడా రిజర్వేషన్లు తీసుకొచ్చామన్నారు. త్వరలోనే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా దళితబంధు అమలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్పష్టం చేశారు.

## ఆసరా పెన్షన్ల కోసం ఎదురుచూపు

(మొదటి పేజి తరువాయి) మొత్తాన్ని గణనీయంగా పెంచడం, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో కొత్త వారికి పెన్షన్ అందే పరిస్థితి లేకుండా పోయింది. నిరుపేదలకు ఆసరాగా ఉంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తమ కనీస అవసరాలు తీర్చు కునేందుకు ప్రభుత్వం ప్రతినెల ఆసరా పేరిట పింఛన్ విడుదల చేస్తోంది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాన్ని 2014 నుంచి గణనీయంగా పెంచుతూ వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో ఏర్పాటైన టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఆయా వర్గాలకు ఆసరా పింఛన్లను పెంచి అందిస్తోంది. అంతకముందు వృద్ధులు, వితంతువులు, తదితరులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని ఏకంగా రూ.2000 వరకు పెంచారు. ఆ మేరకు ఆసరా పెన్షన్ల పథకం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. తెలంగాణ ఆసరా పింఛన్ పథకం ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, గీతకార్మికులు, ఎయిడ్స్ బాధితులు లబ్దిపొందుతున్నారు. ఆసరా పథకానికి ప్రజల్లో మంచి ఆదరణ లభించడంతో 57 ఏళ్లవారికే ఇస్తామని ప్రకటించింది. ఇకపోతే వృద్ధులకు సహా ఆయా వర్గాలకు రూ.1000 ఉన్న ఆసరా పింఛన్‌ను రెట్టింపు చేస్తూ రూ.2016గా ఇస్తున్నారు. అలాగే వికలాంగులకు ఉన్న రూ.1500 పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేరుకు తగిన విధంగా చేయూతనిస్తుండటంతో ప్రజల్లో మంచి స్పందన ఉంది. ప్రభుత్వం సూచించే అన్ని అర్హతలు ఉన్నందున తమకు ఆసరా పింఛన్ మంజూరు చేయాలంటూ జిల్లాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు.

## కొత్తగా 12,591 కరోనా కేసులు నమోదు



(మొదటి పేజి తరువాయి) యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇక కరోనాతో బుధవారం ఒక్కరోజే 40 మంది మృతి చెందారు. అత్యధికంగా కేరళలో 11 మంది మృతి చెందినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. దీంతో తాజా మరణాలతో కలిపి కోవిడ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు కోవిడ్ మరణాల సంఖ్య 5,31,230కు చేరింది. ఇక పాజిటివిటీ రేటు 5.46 శాతంగా ఉంది. రికవరీ రేటు 98.67 శాతంగా ఉంది. ఇప్పటివరకు కరోనా నుంచి కోలుకున్న వారి సంఖ్య 4,42,61,476కి చేరింది. మరణాల రేటు 1.18 శాతంగా ఉంది. ఆరోగ్యశాఖ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం కోవిడ్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో భాగంగా 220.66 కోట్ల డోసులను కేంద్రం పంపిణీ చేసింది. ఇదిలావుంటే కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కోవిడ్-19 పాజిటివ్ అని తేలింది. ఆయన నేడు న్యూఢిల్లీలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్స్ సమావేశంలో పాల్గొనాల్సి ఉండింది. కానీ కోవిడ్ పాజిటివ్ అని పరీక్షలో తేలాక ఆయన ఆ సమావేశానికి హాజరు కాబోడంలేదు. ప్రస్తుతం ఆయన హోమ్ క్వారంటైన్‌లో ఉన్నారు. ఆయనకు కోవిడ్ లక్షణాలు స్వల్పంగా ఉన్నాయి. డాక్టర్ల బృందం ఆయనను పరీక్షించి విశ్రాంతి తీసుకోవలసిందిగా సూచించారు. ఈ మధ్య కాలంలోనే కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియాకు కూడా కోవిడ్-19 పాజిటివ్ అని తేలింది. ఆయన సోమవారం ఈ విషయాన్ని ట్వీట్ చేశారు.

## నిమ్స్ విస్తరణ పనులకు త్వరలో కెసిఆర్ శంకుస్థాపన

కొత్తగా 2,000 పడకలతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ● నగరంలో కొత్త ఆస్పత్రుల నిర్మాణం వేగవంతం ● త్వరలో న్యూట్రిషియన్ కిట్ల అందచేత ● వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (సమసమాజం):** నిమ్స్ దవాఖాన విస్తరణ పనులకు సీఎం కేసీఆర్ వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నట్టు రాష్ట్ర వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కొత్తగా 2,000 పడకలతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందించే లక్ష్యంతో విస్తరణ పనులను చేపడుతున్నామని చెప్పారు. హైదరాబాద్ నాంపల్లిలోని ఏరియా హాస్పిటల్‌లో డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్‌ను గురువారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. నగరం నలువైపులా గచ్చిబౌలి, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో నిర్మించనున్న టిమ్స్ దవాఖానల పనులను వేగవంతం చేస్తామన్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలకు పేదల ఆరోగ్యం పట్టలేదని మండిపడ్డారు. బ్రిటిష్ కాలంలో, నిజాం కాలంలో ఏర్పాటు చేసిన గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తప్ప ఏడు దశాబ్దాల పాలనలో ఒక్క సూపర్ స్పెషాలిటీ దవాఖాన కట్టలేదని మండిపడ్డారు. కానీ.. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు కొత్తగా నాలుగు టిమ్స్ (4 వేల పడకలు) నిర్మిస్తున్నారని, నిమ్స్ దవాఖాన విస్తరణ (2 వేల పడకలు) చేపట్టారని తెలిపారు. తద్వారా ఏకంగా ఆరువేల పడకలు అదనంగా అందుబాటులోకి రానున్నట్టు వెల్లడించారు. దీంతోపాటు వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న హెల్త్ సిటీ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. అత్యవసర సమయాల్లో ఉత్తమ వైద్యం అందించేందుకు ట్రామా కేర్ సెంటర్లను బలోపేతం చేయనున్నట్టు మంత్రి తెలిపారు. లెవల్ 1, 2, 3గా వర్గీకరించి అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్పొరేట్ తరహాలో అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గర్భిణులు, పుట్టబోయే పిల్లల ఆరోగ్యం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ను ఒకటి రెండు వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మొత్తం 6.5 లక్షల మంది గర్భిణులకు ప్రయోజనం కలుగనున్నట్టు చెప్పారు. ఇందుకోసం బడ్జెట్లో సీఎం కేసీఆర్ రూ.250 కోట్లు కేటాయించారని చెప్పారు. ఇప్పటికే లక్ష కిట్లు జిల్లాలకు పంపించామని, మరో లక్ష కిట్లు సేకరిస్తున్నామని వెల్లడించారు. అవి రాగానే పంపిణీని ప్రారంభిస్తామని హరీశ్‌రావు ప్రకటించారు.

## వరంగల్ బస్టాండులో డ్రైవర్ నిర్లక్ష్యం

(మొదటి పేజి తరువాయి) పాటు ప్రయాణికులు కూడా ఆందోళనకు దిగారు. తన స్నేహితుడిని బస్సు ఎక్కించడానికి చింతా అనిల్ అనే విద్యార్థి వరంగల్ బస్ స్టాండ్ కు వెళ్లాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ ఆర్టీసీ బస్సు.. అనిల్ ను ఢీ కొనడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇది గమనించిన ప్రయాణికులు, విద్యార్థులు నాలుగు బస్సుల అద్దాలను కోపంతో ధ్వంసం చేశారు. విషయం తెలియగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అనిల్ మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు.

## విఆర్‌వో వ్యవస్థతో పనిలేదు

(మొదటి పేజి తరువాయి) జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. వీఆర్వో వ్యవస్థ రద్దుకు గల కారణాలతో పాటు బదిలీల అంశానికి సంబంధించిన వివరాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేయడం విధాన నిర్ణయమని ఏజీ తెలిపారు. వీఆర్‌వోలను ఇతర శాఖల్లోకి బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేసేహక్కు ఉద్యోగికి లేదని పేర్కొన్నారు. వీఆర్‌వోల వేతనం, స్థాయికి తగ్గకుండా వారిని ఇతర శాఖల్లో నియమించినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తీసుకున్న రద్దు నిర్ణయాన్ని కొంతమంది వీఆర్వోలు ఆమోదించారని...కేవలం 60 మంది మాత్రమే విధుల్లో చేరలేదని వివరించారు. రెవెన్యూ శాఖలోని పోస్టుల్లోనే చేరాలని కోరుకునే హక్కు వీఆర్వోలకు లేదన్నారు.

## వేసవి రద్దీతో మెట్రో స్టేషన్లు కిటకిట



(మొదటి పేజి తరువాయి) అయితే ఎసిలో ప్రయాణించవన్న ఆలోచనతో ప్రయాణికుల మెట్రోకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో గురువారం అన్ని మెట్రో స్టేషన్లలో రద్దీ ఏర్పడింది. నాగోలు టూ రాయదుర్గం రూట్ అయితే రైల్లో ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.నాగోలు స్టేషన్ ప్రయాణికులతో నిండిపోయింది. ఇసుకేస్తే రాలనంత జనం ఉన్నారు. స్టేషన్లు ఫుల్ అయ్యి.. మెట్లపై వరకు నిల్చున్నారు ప్రయాణికులు. ఉదయం సమయంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక రైలు నడుస్తుంది. ప్రస్తుతం నాగోలు, అమీర్ పేట రైల్వే స్టేషన్లలో పరిస్థితి చూస్తే.. నిమిషానికి ఒక రైలు నడిపినా ప్రయాణికులు సంఖ్య తగ్గేలా లేదు. ఎండాకాలం ప్రారంభం అయినప్పటి నుంచి సర్వీసుల సంఖ్య పెంచింది మెట్రో. అయినా రద్దీ కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా నాగోలు, ఎల్బీనగర్, దిల్ షుఖ్ నగర్, కూకట్ పల్లి నుంచి ప్రాంతాల నుంచి ఉద్యోగ, వ్యాపారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే వారు.. ఎండాకాలం కావటంతో చల్లగా మెట్రో వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. ముంబై, జపాన్ దేశాల్లో రెగ్యులర్ గా కనిపించే దృశ్యాలు ఇప్పుడు హైదరాబాద్ మెట్రో కనిపించటం విశేషం. మెట్రో ప్రారంభం అయిన కొత్తగా.. ఎలా ఉందో చూడ్డానికి జనం ఎగబడ్డారు.. మళ్లీ అలాంటి సిట్యువేషన్ రెగ్యులర్ రోజుల్లో కనిపించటం విశేషం. కరోనా సమయంలో పీక్ లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య మూడు లక్షలు దాటింది. మళ్లీ ఇప్పుడు అది నాలుగు లక్షలకు రీచ్ అయినట్లు లెక్కలు చెబుతున్నారు. ఎండాకాలం.. ప్రస్తుతం ఐదు లక్షల మంది వరకు రోజువారీగా మెట్రో ప్రయాణిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మెట్రో స్టేషన్లలో నెలకొన్న రద్దీతో సర్వీసులు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు మెట్రో అధికారులు సర్వీసుల సంఖ్య పెంచుతారా అన్నది చూడాలి.

# చీరకట్టులో మంఛెస్టర్ మారథాన్

## మెడల్ సాధించిన మధుస్మిత జెనా




లండన్,ఏప్రిల్20(**సమ సమాజం**): సాధారణంగా రన్నింగ్ అంటే టీషర్ట్.. స్వెట్ ప్యాంట్ వేసుకుంటారు. కానీ ఓ మహిళ మాత్రం చీర ధరించింది. అదేంటి చీర ధరించి రన్నింగ్ ఎలా చేస్తారని అనుకుంటున్నారా.. అవును..ఆ మహిళ చీర ధరించి రన్నింగ్ చేయడమే కాదు..మెడల్ కూడా సాధించింది. ఈ సంఘటన యూకేలోని ఆదిదాస్ మాంచెస్టర్ మారథాన్‌లో చోటు చేసుకుంది. భారత్ ఒడిశాకు చెందిన 42 సంవత్సరాల మధుస్మిత జేనా అనే మహిళ మాంచెస్టర్ మారథాన్‌లో పాల్గొంది. మాంచెస్టర్‌లోనే నివశించే మధుస్మితకు మారథాన్ రేసులంటే చాలా ఇష్టం. అందుకే ఈ మారథాన్‌లో పాల్గొంది. అయితే అందరి లాగా టీషర్ట్, ప్యాంటు వేసుకోలేదు. భారతీయ వస్త్రాలైన చీర కట్టుకుని ఈ మారథాన్ లో పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించింది. 41 కిలోమీటర్ల మారథాన్ ను మధుస్మిత గంటా 50 నిమిషాల్లో పూర్తి చేసి మెడల్ సాధించింది. అంతేకాదు మెడల్ కూడా దక్కించుకుంది. మాంచెస్టర్ మారథాన్ 2023లో మధు స్మిత ధరించిన చీరె సంబాల్‌పురి చీర. ఈ రేసులో చీరెతో చాలా కంఫర్టబుల్‌గా పరుగు తీసింది. చీరలో పరుగెడుతున్న మధుస్మితను ఇతర అ÷-లథెట్లు చప్పట్లతో ప్రోత్సహించారు. ఈ రేస్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ట్విటర్లో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

# మొహాలీ వేదికగా పంజాబ్,ఆర్సీబి మ్యాచ్

### 4 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసిన ఆర్సీబి

### హాఫ్ సెంచరీలతో అదరగొట్టిన డుప్లెసిస్, కోహ్లీ



**మొహాలీ,ఏప్రిల్20(సమ సమాజం):** మొహాలీ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ 4 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. టాస్ ఓడి బ్యాంటింగ్‌కు దిగిన ఆర్సీబికి తొలుత ఎదురు దెబ్బలు తగిలాయి. మిడిలార్డర్ మరోసారి నిరాశపరిచింది. పంజాబ్ కింగ్స్‌తో మొహాలి వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో డుప్లెసిస్ 84, తాత్కాలిక కెప్టెన్ విరాట్ కోహ్లీ 59 పరుగులతో హాఫ్ సెంచరీలు బాదారు. మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు టీమ్ 4 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఈ ఇద్దరూ మినహా బెంగళూరు జట్టులో ఎవరూ కనీసం డబుల్ డిజిట్ స్కోరుని కూడా నమోదు చేయలేకపోయారు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బరార్ రెండు, అర్షదీప్ సింగ్, నాథన్ ఎలిస్ చెరో వికెట్ తీశారు. మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ తాత్కాలిక కెప్టెన్ శామ్ కరన్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దాంతో విరాట్ కోహ్లీతో కలిసి బెంగళూరు ఇన్నింగ్స్‌ని స్టార్ట్ చేసిన డుప్లెసిస్ మొదటి నుంచి దూకుడుగా ఆడేశాడు. అయితే.. విరాట్ కోహ్లీ మాత్రం కాస్త ఆలస్యంగా గేర్ మార్చాడు. ఈ క్రమంలో ఇద్దరూ హాఫ్ సెంచరీలు నమోదు చేయడంతో పాటు 16 ఓవర్ల పాటు పంజాబ్ బౌలర్లకి వికెట్ ఇవ్వలేదు. అలానే 16.1 ఓవర్లలో తొలి వికెట్‌కి 137 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో విరాట్ కోహ్లీని హర్‌ప్రీత్ బరార్ ఔట్ చేశాడు. అదే ఓవర్‌లో గ్లెగెన్ మాక్స్‌వెల్(0)ని గోల్డెన్ డక్‌గా పెవిలియన్‌కి పంపించాడు. ఆ తదుపరి ఓవర్‌లో డుప్లెసిస్‌ని ఎలిస్ ఔట్ చేసేయడంతో బెంగళూరు భారీ స్కోరు కల చెదిరింది. స్లాగ్ ఓవర్లలో దినేశ్ కార్తీక్ (7: 5 బంతుల్లో), మహిపాల్ లూమర్ (7 నాటౌట్: 9 బంతుల్లో 1లీ4), షబాజ్ అహ్మద్ (5 నాటౌట్: 3 బంతుల్లో) హిట్టింగ్ చేయలేకపోయారు. దాంతో బెంగళూరు 174 పరుగులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. శుభారంభం లభించినా ఆ జట్టు భారీ స్కోర్ చేయలేకపోయింది. ఫామ్ కొనసాగించిన కోహ్లీ, డూప్లెసిస్ అర్ధ శతకాలతో చెలరేగారు. వీళ్ల జోరు చూస్తే ఒక దశలో ఆర్సీబీ రెండొందలు కొట్టేలా కనిపించింది. కానీ, పంజాబ్ బౌలర్లు పుంజుకొని ఆర్సీబీని కట్టడి చేశారు. చివర్లో దినేశ్ కార్తిక్(7) ఒక్కడే ఫర్వాలేదనిపించాడు.పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ రెండు వికెట్లు, నాథన్ ఎల్లిస్, అర్షదీప్ సింగ్ తలా ఒక వికెట్ తీశారు.

# పవర్‌ప్లేలో బోరింగ్ బ్యాంటింగ్

## కెఎల్ రాహుల్ ఆటతీరుపై కెవిన్ పీటర్స్



న్యూఢిల్లీ,ఏప్రిల్20(సమ సమాజం): ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ కెప్టెన్ కేఎల్ రాహుల్ బ్యాటింగ్‌పై ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పవర్ ప్లేలో రాహుల్ వేగంగా పరుగులు చేయలేకపోతున్నాడని, తొలి ఆరు ఓవర్లలో బ్యాటింగ్ నెమ్మదించిందని విమర్శించాడు. పవర్ ప్లేలో అతని బ్యాటింగ్ చూడడం పరమ బోరింగ్ అయిన విషయమని అంటూ వ్యాఖ్యానించాడు. కేఎల్ రాహుల్‌పై పీటర్సన్ చేసిన ఈ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ 32 బంతులు ఆడి నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 39 పరుగులు చేశాడు. రెండుసార్లు అవకాశాలు వచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకొని భారీ స్కోరును సాధించడంలో విఫలమయ్యాడు. ఇన్నింగ్స్ ఓపెనింగ్‌లో ట్రెంట్ బౌల్ట్ బౌలింగ్‌లో ఆరు బంతులు ఆడిన రాహుల్ ఒక్క పరుగు కూడా చేయలేకపోయాడు. పవర్‌ప్లేలో 19 బంతులు ఎదుర్కొన్న రాహుల్.. కేవలం 19 పరుగులు మాత్రమే చేయగలిగాడు. దాంతో రాహుల్ ఆటతీరును చూసి చిర్రెత్తుకొచ్చిన పీటర్సన్ కామెంట్రీ సమయంలో అసహనం వ్యక్తం చేశాడు. అయితే, ఐపీఎల్ రాహుల్ ఆట తీరు దారుణంగా ఉంది. ఓ వైపు రాహుల్‌తో ఓపెనింగ్‌కు వస్తున్న కైల్ మేయర్స్ బ్యాటింగ్ చేస్తున్నంత సేపు భారీ షాట్స్ ఆడేందుకు ప్రయత్నిస్తుండగా.. లక్నో కెప్టెన్ మాత్రం ఢిపెన్స్‌తో అభిమానులను సైతం నిరాశకు గురి చేస్తున్నాడు.

# ఐపిఎల్‌లో కొందరి ఆటతీరు అంతే

### రాణించలేక పోతున్న పలువురు ప్లేయర్లు

**ముంబై, ఏప్రిల్ 20 (సమ సమాజం):** ఐపిఎల్‌లో ఇప్పటికే కొందరు బాగా రాణిస్తుండగా..మరికొందరు పేలవ ప్రదర్శన ఇస్తున్నారు. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఇప్పటికే 27 మ్యాచ్‌లు ముగిశాయి. అయితే ఈ టోర్నీలో కొందరు ప్లేయర్లు దారుణంగా విఫలం అయ్యారు. అసలు ఏమాత్రం తన ట్యాలెంట్ ప్రదర్శించలేక పోయారు. పృథ్వీ షా, సర్ఫరాజ్, రియాన్ పరాగ్, కృనాల్ పాండ్యా, ఆయుష్ బదోనీలు.. ఈ సారి ఐపీఎల్‌లో దారుణంగా విఫలమవుతున్నారు. టోర్నీలో ఏమాత్రం వాళ్లు తమ సత్తా చాటలేకపోతున్నారు. ఫ్రాంచైజీలు భారీ ధర పెట్టికొన్నా.. ఆ ప్లేయర్లు మాత్రం నిరాశపరుస్తున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ పృథ్వీ షాను 8 కోట్లు పెట్టి కొన్నారు. కానీ అతను ఈ ఏడాది నిరుత్సాహపరిచాడు. రిషబ్ పంత్ లేని కారణంగా, పృథ్వీ షా రాణిస్తాడని ఆశించారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు ఆడిన 5 మ్యాచుల్లో అతను కేవలం 34 రన్స్ మాత్రమే చేశాడు.ఢిల్లీ క్యాపిటల్స్‌లో మరో ప్లేయర్ కూడా నిరాశపరిచాడు. సర్ఫరాజ్ ఖాన్ రెండు మ్యాచ్‌లే ఆడాడు. ఆ రెండు మ్యాచుల్లో అతను 34 రన్స్ చేశాడు. దేశవాళీ సీజన్‌లో టాప్ ఫామ్ కనబరిచిన సర్ఫరాజ్ .. ఐపీఎల్‌లో మాత్రం చేతులెత్తేశాడు.రియాన్ పరాగ్ పై రాజస్తాన్ రాయల్స్ గంపెడు ఆశలు పెట్టుకున్నాడు. కానీ ఈ సీజన్‌లో అతను ఆశించిన రీతిలో రాణించలేదు. 5 మ్యాచుల్లో అతను 54 రన్స్ చేశాడు. ఈ యేటి ఐపీఎల్‌లో అతని ఫెయిల్ అయ్యాడు. కృనాల్ పాండ్యా కూడా మెరుగైన ప్రదర్శన ఇవ్వడంలేదు. ఆరు మ్యాచ్‌లు ఆడిన అతను కేవలం 80 రన్స్ మాత్రమే కొట్టాడు. లక్నో జట్టు అతనిపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకోవడం లేదు. 8.25 కోట్లు పెట్టి కొన్న కృనాల్ మరింత ధీటైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. ఆయుష్ బదోనీ గత ఏడాది ఐపీఎల్‌లో మంచి స్టార్ట్ ఇచ్చాడు. కానీ ఈసారి అతను ఇబ్బందిపడుతున్నాడు. 6 మ్యాచుల్లో బదోనీ కేవలం 77 రన్స్ మాత్రమే చేశాడు. లక్నో జట్టు అతని రిటర్న్ కోసం ఎదురుచూస్తోంది.




# మైత్రీ సంస్థపై ఐటి దాడులు

## పుష్ప-2 చిత్రీకరణపై ప్రభావం



నిన్న ప్రముఖ నిర్మాత సంస్థ మైత్రీ మూవీస్ ఆఫీస్ మీద, అలాగే దర్శకుడు సుకుమార్ ఇంట్లోనూ ఐటి ఐటి దాడుల నేపథ్యంలో పుష్ప-2 చిత్ర నిర్మాణంపై ప్రభావం పడుతుందన్న వార్త తెలుగు సినిమా పరిశ్రమని కుదిపేసింది. మైత్రి మూవీస్ సంస్థ మీద ఇదేమి మొదటి సారి కాదు,ఇంతకు ముందు కూడా ఇలాగే దాడులు జరిగాయి.అల్లు అర్జున్ నటిస్తున్న 'పుష్ప 2' సినిమా నిర్మాణం చేస్తున్నది, మైత్రీ మూవీస్, దానికి దర్శకుడు సుకుమార్. ఈ సినిమా షూటింగ్ ఈమధ్యనే విశాఖపట్నంలో ఒక పెద్ద పోరాట సన్నివేశాన్ని చిత్రీకరించుకొని యూనిట్ తిరిగి హైదరాబాద్ వచ్చింది. మళ్ళీ ఇక్కడ హైదరాబాద్ లో షూటింగ్ మొదలెట్టాలని అనుకున్న సమయానికి ఐటి రైడ్స్ జరుగుతున్నాయి. వరుసగా గురువారం రెండో రోజు కూడా ఈ రైడ్స్ జరుగుతున్నాయని తెలుస్తోంది.మరి దీని వలన 'పుష్ప 2' షూటింగ్ కి అంతరాయం కలగవచ్చని కూడా అంటున్నారు. ఈ రైడ్స్ అయ్యాక తేరుకొని అప్పుడు కొత్త షెడ్యూల్ వేస్తే అప్పుడు షూటింగ్ మొదలెట్టవచ్చని పరిశ్రమలో టాక్ నడుస్తోంది. ఈమధ్య కాలంలో చాలా పెద్ద బడ్జెట్ సినిమాలు తీస్తూ అందరి దృష్టిని ఆకర్షించిన సంస్థ మైత్రీ మూవీ మేకర్స్. సంక్రాంతికి చిరంజీవితో తీసిన 'వాల్తేరు వీరయ్య' కి బాగా ప్రాఫిట్స్ వచ్చాయని అందరికీ తెలిసిన విషయమే. అలాగే బాలకృష్ణ నటించిన 'వీరసింహా రెడ్డి' కూడా విజయం సాధించింది. ఇప్పుడు రాబోయే 'పుష్ప 2' కోసం ప్రపంచవ్యాప్తంగా ఎదురుచూస్తున్నారు. ఆ సినిమాకి కూడా జీ5 వాళ్ళు 950 కోట్ల రూపాయలకి ఆఫర్ ఇచ్చారని కూడా వార్తలు వచ్చాయి. ఇవన్నీ బేస్ చేసుకొని రైడ్స్ అవుతున్నాయేమో అని టాక్ నడుస్తోంది. అందువల్ల ఈ ప్రభావం 'పుష్ప 2' షూటింగ్ కి అంతరాయం ఉండొచ్చేమో అని కూడా అంటున్నారు.

# అఖిల్ అక్కినేని'ఏజెంట్' సినిమా

### ప్రచారంలో కొత్తపుంతలు



అఖిల్ అక్కినేని'ఏజెంట్' సినిమాతో ఏప్రిల్ 28 న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాకి అఖిల్ ఎంత కష్టపడ్డాడు అనేది అతని మాటల్లోనే తెలిసిపోతోంది. సినిమా షూటింగ్ వివిధ కారణాల వాళ్ళ డిలే అయినా కూడా అదే బాడీ ఫిజిక్ ని మెన్ట్రైన్ చేస్తూ, అలాగే ఆహార నియమాలు పాటిస్తూ అఖిల్ చాలా సహనంగా ఈ సినిమా విడుదల కోసం వేచి చూస్తున్నాడు. హిందీలో విడుదల చెయ్యకూడదు అని చివరి నిముషంలో తీసుకున్న నిర్ణయం కూడా చాలా స్పోర్టివ్ గా తీసుకొని ముందుకు వెళుతున్నాడు. అలాగే కొన్ని రోజుల క్రితం విజయవాడ లో జరిగిన ఈ సినిమా ప్రచార ఈవెంట్ లో అఖిల్ చాలా ఎత్తయిన మల్టీప్లెక్స్ పైనుండి కిందకి దూకి ట్రైలర్ గురించి చెప్పాడు. అంటే అఖిల్ ఈ సినిమా విడుదలకి ముందు ప్రేక్షకులని సినిమా థియేటర్స్ కి రప్పించడానికి, సినిమాని ముందుకు తీసుకెళ్లడానికి తనవంతు కృషి చేస్తున్నాడు. దీనికి సురేందర్ రెడ్డి దర్శకుడు అయితే, అనిల్ సుంకర నిర్మాత. ఇప్పుడు పరిశ్రమలోని చాలామంది మహేష్ బాబు తో సహా ఇతర నటులు అందరూ ఈ ట్రైలర్ చూసి అఖిల్ ని ప్రశంసిస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ట్రైలర్ చూసి అఖిల్ ట్రాన్సఫార్మేషన్ చాల బాగుంది అని చెపుతున్నాడు. అలాగే అనిల్ సుంకర ని కూడా ప్రశంశలతో ముంచెత్తాడు. చాలామంది యువనటులు అడివి శేష్, సాయి ధరమ్ తేజ్‌లాంటి వాళ్ళు ట్వీట్ చెయ్యగా, చాలామంది పరిశ్రమలోని వాళ్ళు అఖిల్ ని ప్రశంసిస్తున్నారు. గత కొన్ని రోజులనుండి అఖిల్ 'ఏజెంట్' సినిమా ప్రచారం లోనే పాల్గొంటున్నాడు. ఆంధ్రప్రదేశ్ లోని పట్టణాలు తిరుగుతూ, ఈ వారం ఇక్కడ తెలంగాణలోని పట్టణాలు కూడా చుట్టేస్తాడని అంటున్నారు. 28 ప్రీ-రిలీజ్ వేడుక కూడా వరంగల్ లో ఉంటుందని అంటున్నారు. ఒక పెద్ద స్టార్ ఈ వేడుకకు ముఖ్య అతిధి గా వస్తాడని కూడా చెపుతున్నారు. ఈ సినిమాలో సాక్షి వైద్య కథానాయకురాలు కాగా, మమ్ముట్టి, డినో మోరీ లు ప్రధాన పాత్రల్లో కనపడతారు.

# ఆదిపురుష్..టీజర్ అప్‌డేట్

### గతంకన్నా బెటర్ అన్న ధోరణిలో చిత్రబృందం




ప్రభాస్, కృతి సనన్ జంటగా 'ఆదిపురుష్' యానిమేషన్ సినిమా టీజర్ ఆమధ్య ఎప్పుడో విడుదల అయింది. ఆ టీజర్ వచ్చాక, ఏ ఇండియన్ సినిమాకి రానంతగా ట్రోల్స్ వచ్చాయి. ప్రభాస్ బాగోలేడని, సైఫ్ అలీ ఖాన్ వేసిన రావణుడు పాత్ర అస్సలు బాగోలేదని, ఇంకా యానిమేషన్ చాలా నీచంగా ఉందని ట్రోల్ చేశారు. ఆ టీజర్ రిలీజ్ ఫంక్షన్ తరువాత ప్రభాస్ దర్శకుడు ఓం రౌత్ ని 'కం టు మై రూమ్' అనే మాట ఎంత వైరల్ అయిందో తెలిసిందే కదా. అది అప్పటి కథ.ఇప్పుడు ఆ సినిమా నిర్వాహకులు అదే టీజర్ కి అప్డేట్ వెర్షన్ ఇచ్చారు. అయితే ఇది మీడియా వాళ్ళకి కానీ, వేరే వాళ్ళకి కానీ పంపలేదు, వాళ్ళ వెబ్ సైట్ లో పెట్టుకున్నారని తెలిసింది. ఇప్పుడు అప్డేట్ చేసిన ఈ కొత్త టీజర్ పాత దాని మీద కొంచెం బెటర్ క్వాలిటీ అని మాత్రం అంటున్నారు. అప్పట్లో ఈ టీజర్ మీద ట్రోల్స్ వచ్చాక, ప్రభాస్ దర్శకుడుకి ఈ సినిమా యానిమేషన్ మీద వర్క్ చెయ్యాలని సూచించాడని కూడా అన్నారు. ఆలా అప్డేట్ చేసాక ఈ సినిమాని ఫిలిం ఫెస్టివల్స్ కి పంపించటం జరిగిందని, అందులో ప్రసంశలు అందుకుంది చెపుతున్నారు. అలాగే సంక్రాంతికి విడుదల అవ్వాల్సిన ఈ సినిమా ఆ టీజర్ బాగోలేకపోవటం వలన జూన్ 16 కి పోస్టుపోన్ అయిందని కూడా చెప్పారు. ఇప్పుడు జూన్ 16 న విడుదల అవ్వబోయె సినిమా కోసం ప్రభాస్ అభిమానులు, మిగతా ప్రేక్షకులు కూడా ఎదురు చూస్తున్నారు. ఈ అప్డేట్ అయిన టీజర్ ని ఎందుకు మీడియా వాళ్ళకి చూపించలేదంటే, ఎలాగు ట్రైలర్ విడుదల చేస్తాము కదా, అది చూపిద్దాం, ఈ టీజర్ ఎందుకు అని చిత్ర నిర్వాహకులు అభిప్రాయపడ్డారని తెలిసింది. ఆదిపురుష్ సినిమా కి ఓం రౌత్ దర్శకుడిగానే కాకుండా, నిర్మాతగా భూషణ్ కుమార్, రాజేష్ మోహనన్, క్రిషన్ కుమార్ లతో నిర్మిస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in